


# కరపత్రం

SINCE 2014

శుక్రవారం అక్టోబరు 10 2025 సంపుటి :2 సంచిక : 7 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

### కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదు - ఈసీ కీలక వ్యాఖ్యలు



2లో

### డిజిటల్ ఐడీ దిశగా యూకే.. మన ఆధార్‌పై కీర్ స్టార్మర్ మనసు



2లో

# ట్రంప్ పీస్ ప్లాన్‌పై సంతకాలు.. ఎక్స్ వేదికగా మోదీ పోస్ట్




- హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు.
- ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుంది.
- సోమవారం బందీలు విడుదల కావొచ్చని ట్రంప్ చెప్పారు.

గాజా లో యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్‌మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించాయని, ఒప్పందంపై ఇరుపక్షాలు సంతకం చేశాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. దీనిపై తాజాగా ప్రధాని మోదీ స్పందించారు. ట్రంప్ శాంతి ప్రణాళికకు సంబంధించి మొదటి దశ ఒప్పందాన్ని స్వాగతించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బలమైన నాయకత్వానికి ఇది అద్దంపడుతోందన్నారు.

పేజి 2లో ▶

## మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు.. కర్ణాటక కీలక నిర్ణయం



మహిళా ఉద్యోగుల విషయంలో కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నెలకు ఒక రోజు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులతో పాటు వస్త్రపరిశ్రమ, బహుళజాతి సంస్థలు, ఐటీ కంపెనీలు, ఇతర ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేసే వారికి ఈ సెలవు వర్తించనుందని ప్రభుత్వం వెల్లడించింది. పేజి 2లో ▶

## బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం: కాంగ్రెస్



బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు మేలు చేయడాన్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. ఈ పార్టీల నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. పేజి 2లో ▶

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతాం



2లో

## హైదరాబాద్‌లో 220 కిలోల ఎఫిడ్రిన్ పట్టివేత



2లో




## బీసీ రిజర్వేషన్లు.. తెలంగాణ హైకోర్టు షాక్..

తెలంగాణ హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో నేడు వాడీవేడి వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు స్టే విధించి షాక్ ఇచ్చింది.

మిగతావి 2లో

## 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధికి కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయి:



హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయని భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే వ్యవహారంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా నాటకాలు ఆపాలన్నారు. ఆరు గ్యారంటీల్లాగే 42 శాతం బీసీ రిజర్వేషన్లూ డ్రామా అని వ్యాఖ్యానించారు. 55 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఏనాడైనా బీసీల కోసం పనిచేసిందా? అని ప్రశ్నించారు. హస్తం పార్టీకి చిత్తశుద్ధి ఉంటే జాతీయ నేతలతో దిల్లీ వేదికగా కొట్లాడాలన్నారు. పార్లమెంటులో ఈ మేరకు చట్టం చేయించాలన్నారు. కలిసి వచ్చేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు.

**కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: కిషన్‌రెడ్డి**

రేవంత్‌రెడ్డి సర్కారు చేతకానితనం వల్లే హైకోర్టు స్టే విధించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్లాన్-బీ సిద్ధం చేసుకుని కోర్టులో తూతూమంత్రంగా వాదించారని ఆరోపించారు. బీసీలను హస్తం పార్టీ రాజకీయంగా వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడే సుప్రీం కోర్టు రిజర్వేషన్లపై 50శాతం పరిమితి విధించిందని గుర్తుచేశారు.

పేజి 2లో ▶

## హైకోర్టు ఎదుట బీసీ సంఘాల ఆందోళన..

బీసీల నోటికాడ ముద్ద లాక్కున్నారు



2లో

## సర్కార్ నడవట్లేదు..సర్కస్ నడుపుతున్నారు

- బస్‌ఛార్జీల పెంపుతో కుటుంబాలపై భారం
- మహిళలకు ఉచితబస్సు..మగాళ్లపై ఛార్జీల భారం
- బస్ భవన్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
- ఎండి నాగిరెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చిన కెటిఆర్



రాష్ట్రంలో సర్కారు నడపట్లేదు.. సర్కస్ నడుపుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. బస్ భవన్ వద్ద నిరసనలో భాగంగా ఆయన మాట్లాడారు. ఉదయం మా పార్టీ నేతలను గృహ నిర్బంధం చేశారు.. తర్వాత వెళ్లవచ్చన్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ అరెస్టు చేస్తున్నారు. పేజి 2లో ▶

## సర్కార్ నడవట్లేదు..సర్కస్ నడుపుతున్నారు

మొదటిపేజీ తరువాయి
ఏం చేస్తున్నారో అర్థం కావట్లేదు. ఉచిత బస్సు పథకం పెట్టి ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారు. ఆ నష్టాలను భరించాల్సింది ప్రభుత్వమే. మహిళలకు ఉచిత బస్సు కల్పించి.. పురుషులకు రెట్టింపు వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో కుటుంబంపై టికెట్ ధరల భారం పెరిగింది. ఆర్టీసీ బస్సు పాసుల ధరలు 25 శాతం పెంచారు. మెట్రో నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీని తరిమేశారు. మెట్రో, ఆర్టీసీ లేకుండా మొత్తం ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని కేటీఆర్ అన్నారు. అనంతరం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి భారత రాష్ట్ర సమితి నేతలు వినతిపత్రం అందజేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు తదితరులు వెళ్లారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ చలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు గులాబీ నేతలను గృహనిర్బంధం చేసారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అలాగే వివేకానంద గౌడ్, శంభీర్ పూర్ రాజు, సాయిబాబా తదితరులను కూడా గృహనిర్బంధం చేశారు. ఇక మాజీ మంత్రి , మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని కూడా పోలీసలు హౌస్ అరెస్ట్ చేశారు. పెంచిన బస్సు చార్జీలను వెంటనే తగ్గించాలని చలో బస్ బవన్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అడ్డుకొని గృహనిర్బంధం చేశారు. అంతేకాకుండా... బీఆర్ఎస్ బస్ భవన్ పిలుపు నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని బస్ భవన్ వద్ద పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే

### 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం: కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి
బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు."రిజర్వేషన్లపై మాకు సంకల్పబలం ఉంది. అందుకే ఇక్కడివరకు చేరుకున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు కోర్టుకు వెళ్లారు. 2018లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన చట్టం ఇప్పుడు ఓబీసీలకు ఉరితాడుగా మారింది. ఓబీసీలకు మేలు చేద్దామన్న ఆలోచన ఆ పార్టీకి లేదు. మా ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు. మీ అబద్ధాలు నమ్మేందుకు బీసీలు, సంఘాల నేతలు అమాయకులు కాదు. ఏం లెక్కలున్నాయో చెప్పాలని అడిగారు కనుకే కులగణన చేశాం. జీవో ఇచ్చేసి ఎన్నికలకు వెళ్తే దాన్ని కొట్టేసేవారు. అందుకే శాస్త్రీయంగా కులగణన చేపట్టి బిల్లు పాస్ చేశాం. లక్షమందికిపైగా ఉద్యోగులను పంపి వివరాలు సేకరించాం.

క్యాబినెట్‌లో, అసెంబ్లీలో తీర్మానం చేశాం. ఆ రోజు బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతికి పంపారు. అక్కడ పెండింగ్‌లో ఉంది. ఆ బిల్లును ఆపిందెవరో కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం చెప్పాలి. ఎవరికి చిత్తశుద్ధి ఉందో.. ఎవరికి లేదో ప్రజలు ఆలోచించాలి. బీసీల బిల్లును భాజపా, భారాస కలిసి అడ్డుకుంటున్నాయి. ఈ నేతల వైఖరి చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. కుట్రలు, కుతంత్రాలు చేస్తుందెవరో అందరికీ తెలుసు. రిజర్వేషన్లకు పరిమితి పెట్టింది భారాస.. బిల్లు ఆపింది భాజపా. ఈ పార్టీల నేతలను ఓబీసీలు ఎప్పటికీ క్షమించరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకు రాజకీయంగా, కోర్టులో పోరాడతాం" అని నేతలు మాట్లాడారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతాం

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9 అమలుపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఉన్నత న్యాయస్థానం నిర్ణయంతో బీసీల నోటి వద్ద ముద్ద లాగేసినట్లయిందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. బీసీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతామన్నారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు.
"హైకోర్టు తీర్పు కాపీ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కేసులు వేయించింది భారత రాష్ట్ర సమితే. భాజపాతో కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది. హైకోర్టు స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించాం" అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.
స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధిస్తుందనుకోలేదని, ఉత్తర్వుల కాపీ అందిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు బలంగా వినిపించామని, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర నిధులు రావడం లేదని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి, భాజపా.. హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో చెప్పాలన్నారు.

## రూ.18 కోట్ల ఘరానా మోసం.. బాధితులపై దాడి..!




పటాన్‌చెరు: వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి విద్య అనే మహిళ మోసం చేసిందంటూ బాధితులు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెవిరెడ్డి పీఏ నుంచి రూ.2 వేల కోట్లు వస్తున్నాయని, కంటైనర్లు కొనాలని కొంత మంది వద్ద, బంగారం ఇస్తానని చెప్పి మరికొంత మంది దగ్గర ఆమె డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. డబ్బులు వసూలు చేశాక సికింద్రాబాద్ పరిధిలోని వారాసిగూడ నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు మకాం మార్చిందని వాపోయారు. డబ్బులు ఇవ్వాలని పలుమార్లు అడగ్గా.. అందర్నీ గురువారం రావాలని చెప్పి.. వచ్చిన వారందర్నీ గదిలో పెట్టి దాడి చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిలో కమలమ్మ అనే బాధితురాలికి తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు..

## కర్ణాటక కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి
"శ్రామిక మహిళల ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నాం . నెలసరి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు మహిళలకు మానసిక, శారీరక సౌకర్యం అందించాలన్నదే మా ఉద్దేశం. ఈ నిర్ణయం ఉద్యోగినులకు ఎంతగానో ఉపకరించనుంది. ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు విజయవంతంగా అమలు చేస్తున్నాయి. అందుకే ఇక్కడా ఆ సెలవును ఇవ్వాలనుకున్నాం" అని క్యాబినెట్ సమావేశం అనంతరం న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు.
క్యాబినెట్ మంత్రులకు సీఎం సిద్ధూ డిన్నర్.. 'బిగ్ ఛేంజ్' రానుందా..?
రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మహిళా హక్కుల కార్యకర్త బృందా అడిగె స్వాగతించారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి ఇలాంటి నిర్ణయాలు దోహదం చేస్తాయని హర్షం వ్యక్తంచేశారు. అయితే అసంఘటిత రంగంలో సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఇప్పటికే బిహార్, ఒడిశా, కేరళ, సిక్కిం రాష్ట్రాలు ఈ నెలసరి సెలవును అమలు చేస్తున్నాయి. అలాగే జొమాటో, స్విగ్గీ, ఎల్ అండ్ టీ, గోజూప్ వంటి సంస్థలు వేతనంతో కూడిన ఈ సెలవును ఇస్తున్నాయి

## హైదరాబాద్‌లో

### 220 కిలోల ఎఫిడ్రిన్ పట్టివేత

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: నగరంలో పోలీసులు భారీ మొత్తంలో మాదకద్రవ్యాలను పట్టుకున్నారు. జీడిమెట్లలో 220 కిలోల ఎఫిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.72 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దేశీయంగా రూ.10 కోట్లు ఉంటుందన్నారు. నగరంలోని ఓ రసాయన పరిశ్రమలో తయారు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. ఈ మాదకద్రవ్యాల తయారీలో ప్రధాన నిందితుడిగా శివరామకృష్ణ ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములాను సైతం స్వాధీనం చేసుకున్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధికి కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయి:

మొదటిపేజీ తరువాయి
కనీస అవగాహన లేకుండా రేవంత్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు.

**మాపై అంభాడాలు వేయొద్దు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే విధించేందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్‌కు పూర్తిగా మద్దతిచ్చినట్లు గుర్తుచేశారు. భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య ఇంప్లీడ్ పిటిషన్ వేశారని చెప్పారు. గవర్నర్‌కు బిల్లు పంపి 3 నెలలు కూడా ఓపిక పట్టలేదని విమర్శించారు. జీవో ఇచ్చి షెడ్యూల్ ప్రకటించడంలో లోగుట్టు ఏంటని ప్రశ్నించారు. కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యతని, తమపై అభాండాలు వేయొద్దన్నారు.

## బీసీ రిజర్వేషన్లు.. తెలంగాణ హైకోర్టు షాక్..

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలకు తాత్కాలిక బ్రేక్ పడింది. ఇవాళ (గురువారం) బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండో రోజు వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ వాదనలు విన్న న్యాయస్థానం.. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలు జీఓ 9పై స్టే విధించింది. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించి షాక్ ఇచ్చింది. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై విచారణను 4 వారాలపాటు వాయిదా వేసింది. అనంతరం రెండు వారాల్లోపు అన్ని పార్టీలు కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.
తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించింది. అయితే, జీవో 9 విడుదల అనంతరం హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ మేరకు నిన్న పిటిషన్లపై న్యాయస్థానం విచారణ చేపట్టి నేటికి వాయిదా వేసింది. ఇవాళ మరోసారి విచారణ చేపట్టిన ధర్మసనం.. ప్రభుత్వం తరఫు వాదనలు విని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ తాత్కాలికంగా నిలిచిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తరఫున సమగ్రమైన కౌంటర్‌ను దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తర్వాత.. రెండు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్లకు సూచించింది. హైకోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై సందిగ్ధత నెలకొంది.
బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు.

## హైకోర్టు ఎదుట బీసీ సంఘాల ఆందోళన..

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేలా జారీ చేసిన జీవో 9పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు ఎదుట బీసీ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు..



బీసీల నోటికాడ ముద్దను ఆపారని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తొందరపాటు చర్యలతో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ స్పందన చూశాక బంద్‌కు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కొంతమంది బీసీలకు పదవులు వస్తుంటే ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. త్వరలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని ఆర్.కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారు.

## ట్రంప్ పీస్ ప్లాన్‌పై సంతకాలు.. ఎక్స్ వేదికగా మోదీ పోస్ట్

మొదటిపేజీ తరువాయి
బందీలను విడుదల చేయడం, గాజా ప్రజలకు మెరుగైన మానవతా సాయం అందేలా చూడటం వల్ల శాశ్వత శాంతికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఇజ్రాయెల్- హమాస్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 21 సూత్రాల శాంతి ఫార్ములాను సూచించిన సంగతి తెలిసిందే. దానిని భారత్, రష్యా, చైనా సహా పలు దేశాలు ఆహ్వానించాయి. తాజాగా ఆ దిశగా తొలి అడుగుపడిందని అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. "గాజా మొదటి దశ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్‌లు అంగీకరించినందుకు గర్వంగా ఉంది. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్నవారంతా త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుంది" అని ప్రకటించారు. అలాగే సోమవారం బందీలు విడుదల కావొచ్చని చెప్పారు. అలాగే ఈ విషయంపై ఫోన్ కాల్‌లో ట్రంప్ మాట్లాడుతుంటే బందీల కుటుంబాలు ఆసక్తిగా వింటున్నట్లు ఉన్న ఒక వీడియోను వైట్‌హౌస్ పోస్ట్ చేసింది.
శాంతి ఒప్పందాన్ని హమాస్ సైతం ధ్రువీకరించింది. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి చోటుచేసుకోనుందని వెల్లడించింది. ఈ ఒప్పందం వేళ.. రష్యా (%=బంంఖు%) స్పందించింది. ట్రంప్ అత్యున్నత ప్రతిపాదనలను చేసినట్లు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ అభివర్ణించారు. ఒప్పందంలో నిబంధనలకు అందరూ కట్టుబడి ఉండాలని, గాజాలోకి అన్నిరకాల నిత్యావసరాల సరఫరాలను కొనసాగించాలని ఐరాస పేర్కొంది.

**పీస్ ప్రెసిడెంట్..**

ఈ పరిణామాల వేళ అమెరికా అధ్యక్షుడు 'పీస్ ప్రెసిడెంట్' అని వైట్‌హౌస్ అభివర్ణించింది. ఆయన చేతిలో ఒక ఫైల్ పట్టుకొని నడిచివస్తోన్న ఫొటోను షేర్ చేసింది. ఇదిలాఉంటే.. తనకు నోబెల్ శాంతి బహుమతిపై ఉన్న ఆశలను ట్రంప్ మరోసారి వ్యక్తంచేశారు. శాంతి బహుమతి విజేతను నార్వేజియన్ నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించనున్న నేపథ్యంలో దానిగురించి శ్వేతసౌధంలో రిపోర్టర్లతో మాట్లాడారు (2025 %చీశీఎవశ్రీ ూాఘుఎవ ూతీఱఓవ%). నోబెల్ సంగతి తనకు తెలియదని, అయితే ఏడు యుద్ధాలు ఆపానని, ఎనిమిదో యుద్ధాన్ని కూడా ఆపబోతున్నట్లు చెప్పారు.

## కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదు - ఈసీ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణఅంశంపై సుప్రీం కోర్టులో గురువారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఈసీ ప్రయత్నాలకు సహకరించకుండా.. తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది.
బిహార్‌లో ఎస్ఐఆర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలని సుప్రీం పేర్కొంది. వీటిని పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీల ధర్మాసనం.. ఈ అంశం గందరగోళంగా ఉందని, వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని బిహార్ లీగల్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌ను ఆదేశించింది.
బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి పలువురు పిటిషనర్లు వాదనలు వినిపించారు. దాదాపు 10శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారని సామాజిక వేత్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా.. వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదని ఆరోపించారు. వీటికితోడు లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారని, బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని, ఇప్పటికైనా మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. అధికారులకు వాళ్లు ఏం చేస్తున్నారో అనే విషయం తెలుసునని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

## డిజిటల్ ఐడీ దిశగా యూకే.. మన ఆధార్‌పై కీర్ స్టార్మర్ మనసు

మొదటిపేజీ తరువాయి
ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ డేటాబేస్ విప్లవంగా మన 'ఆధార్' గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. అందుకే యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కూడా దీనిపై ఆసక్తి పెంచుకున్నారు. తమ దేశంలో ప్రవేశపెట్టబోయే డిజిటల్ ఐడీ వ్యవస్థ కోసం మన 'ఆధార్'ను అధ్యయనం చేస్తున్నారు. ఇందుకోసం ఆధార్ రూపకర్త నందన్ నీలేకనితోనూ సమావేశమయ్యారు.
యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. బుధవారం ముంబయి చేరుకున్న ఆయన.. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనితో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని స్టార్మర్ అధికార ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. అయితే, ఇన్ఫోసిస్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ఈ భేటీ జరగలేదని స్పష్టం చేశారు. ఆధార్ వ్యవస్థ పనితీరు, ఇతర వివరాల గురించి తెలుసుకునేందుకు నీలేకనితో సమావేశమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ డిజిటల్ ఐడీ ప్రణాళికల్లో బయోమెట్రిక్ డేటా అంశం లేదని తెలిపారు.
మూడో ఆర్థికశక్తి దిశగా భారత్.. ట్రంప్ 'డెడ్ ఎకానమీ'కి యూకే ప్రధాని కౌంటర్ అక్రమ వలసదారులను అరికట్టేందుకు యూకేలో డిజిటల్ ఐడీలను ప్రవేశపెట్టనున్నట్లు గత నెల స్టార్మర్ వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్‌లో ఉండే ఈ డిజిటల్ ఐడీ సాయంతో యూకే పౌరులు ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ పథకాలు, ఇతర ప్రజా సేవలను సులభంగా పొందొచ్చని తెలిపారు. ఒకవేళ ఈ డిజిటల్ ఐడీ కార్డు లేకపోతే యూకేలో పని చేసేందుకు అర్హత లేనట్లేనని వెల్లడించారు. మరోవైపు భారత్ పర్యటనకు వచ్చే ముందు కూడా స్టార్మర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "భారత్‌లో ఆధార్ ఐడీ వ్యవస్థ భారీ విజయం సాధించింది. అందుకే మా పర్యటనలో దీన్ని అజెండాగా పెట్టుకున్నాం. నా సమావేశాల్లో ఆధార్‌కు సంబంధించి కూడా ఓ భేటీ ఉంటుంది" అని తెలిపారు.
రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నుంచి బ్రిటన్‌లో గుర్తింపు కార్డులు తప్పనిసరి కాదంటూ నిర్ణయం తీసుకున్నారు. వాటి వల్ల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, ప్రైవేటు సమాచారం ప్రమాదంలో పడుతుందని పౌర హక్కుల కార్యకర్తలు ఆరోపించడంతో నాడు ఆ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత టోనీ బ్లెయర్ ప్రధానిగా ఉన్న సమయంలో బయోమెట్రిక్ ఆధారిత ఐడీకార్డులను తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా.. విపక్షాలు, ప్రజల నుంచి వ్యతిరేక రావడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఇప్పుడు వలసల కట్టడిపై చర్యలు చేపట్టిన కీర్ స్టార్మర్ ప్రభుత్వం 'డిజిటల్ ఐడీ' ప్రణాళికలు మొదలుపెట్టింది.
ఇక, భారత ప్రభుత్వం 2009 జూన్ 25న భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ)ని ఏర్పాటుచేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకనీని క్యాబినెట్ మంత్రి హోదాతో దానికి ఛైర్మన్‌గా నియమించింది. 2010 సెప్టెంబర్ 29న మహారాష్ట్రలోని ఒక గ్రామంలో తొలి ఆధార్ కార్డు జారీచేశారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబరు 10 2025

# కోరుట్ల కాంగ్రెస్ పార్టీలోకి వలసలు



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నరసింగరావు సమక్షంలో, కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బిజెపి నాయకుడు దారిశెట్టి గణేశ్ తన 25 మంది అనుచరులతో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, నియోజకవర్గ ఇంచార్జ్ సమక్షంలో కార్యకర్తలకు కండువా వేసి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

# నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
జిల్లాలోని 10 జడ్పీటిసి, 108 ఎంపిటిసి స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కోరుట్ల, మెట్పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, కోరుట్ల, మెట్పల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్ కూడా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# కోరుట్లలో లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

## - పలువురికి గాయాలు





**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం ప్రతినిధి**
గురువారం ఉదయం 4 గంటలకు జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రజ్ఞాపూర్ మండలం కుకునూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో కోరుట్ల ప్రాంతానికి చెందిన పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

# మెటుపల్లి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై

- మున్సిపల్ అధికారుల దాడులు
- నిల్వ ఉంచిన ఆహారం స్వాధీనం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెరుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో గురువారం మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ఆదేశాల మేరకు పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై దాడులు నిర్వహించారు. ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచిన నిన్నటి వెజ్ మంచూరియా, చికెన్ మంచూరియా, చికెన్ 65, మిగిలిపోయిన అన్నం వంటి వాటిని స్వాధీనం చేసుకుని డంపింగ్ యార్డ్ కు తరలించారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో నిన్నటి మాంసం, ఆహారాన్ని నిల్వ ఉంచి, మరుసటి రోజు వేడిచేసి విక్రయిస్తున్నారని కమిషనర్ తెలిపారు.

# ఎన్నికల కోడ్. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్లో (డిపాజిట్ చేయాలి)
- పోలీస్ కమిషనర్ ఎస్. యం. విజయ్ కుమార్, -

**సిద్దిపేట అక్టోబర్ 09, కరపత్రం ప్రతినిధి**
స్థానిక సంస్థల ఆర్డినరీ ఎలక్షన్స్ ఎంపీటీసీ, జడ్పీటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్లో (డిపాజిట్ చేయాలి) అప్పగించాలి ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఆర్డినరీ ఎలక్షన్స్ ఎంపీటీసీ, జడ్పీటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున లైసెన్స్ తుపాకులు కలిగి ఉన్న వ్యక్తులు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఈ నేల 11 రోజు లోపు డిపాజిట్ చేయాలి. ఎన్నికల కోడ్ పూర్తయిన తర్వాత తిరిగి నిబంధనల ప్రకారం తీసుకొని వెళ్లవచ్చు. ఈ నేల 11 లోపు తుపాకులు డిపాజిట్ చేయని వారిపై రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. పారదర్శకంగా విష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ గురించి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను ప్రజలు ప్రజా ప్రతినిధులు తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. జిల్లాలో బార్డర్ పోలీస్ స్టేషన్లలో 05 చెక్పోస్టులు ఏర్పాటు చేయడం జరిగింది 24X7 వాహనాలు తనిఖీ నిర్వహించడం జరుగుతుంది

# కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా

## - మేడ్చల్‌లో బీఆర్ఎస్ నిరసన

కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి

- మేడ్చల్ బస్ డిపో ముందు BRS ధర్నా
- బస్ ఛార్జీలు తగ్గించాలి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిన బస్ ఛార్జీలకు నిరసనగా మేడ్చల్ బస్ డిపో ముందు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు మేడ్చల్ మార్కెట్ నుండి ర్యాలీగా వస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న 6 గ్యారంటీలను అమలు చేయడం లేదని షాపులలో, ప్రజలకు కర పత్రాలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. మేడ్చల్ ఆర్టీసీ డిపో ముందు బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నిపకముందు 6 గ్యారంటీ పథకాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి రాగానే మాట మార్చిందన్నారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలకు తగిన గుణపాఠం చెప్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, బిఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, మేడ్చల్ సొసైటీ చైర్మన్ రణదీప్ రెడ్డి, పార్టీ నాయకులు మెట్టు శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రాజు, సుదర్శన్, విష్ణు చారి తదితరులు పాల్గొన్నారు.

# జైన లో అంగన్వాడీ సూపర్వైజర్ కుసుమ ఆధ్వర్యం లో పోషణ మాసోత్సవము ధర్మపురి









**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి క్టోబర్ 9**
ధర్మపురి ప్రాజెక్ట్ జైన సెంటర్లో ఐసిడిఎస్ సూపర్వైజర్ కుసుమ వారి ఆధ్వర్యంలో పోషణ మహా కార్యక్రమంలో భాగంగా ఈరోజు చక్కర వాడకం మరియు అయోడిన్ యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేయడం జరిగింది గర్భిణీ బాలింతల లోప పోషణ వల్ల కలిగే నష్టాల గురించి మరియు హెల్త్ చెక్ అప్స్ గురించి అవగాహన కలిగించడం జరిగింది..ఇందులో పాల్గొన్న వారు సూపర్ వైజర్ కుసుమ ఆశ కళ్యాణి, ఏ ఎన్ ఎం విమల అంగన్వాడి టీచర్లు రమ,భవాని,ప్రేమలత,అనసూయ గర్భిణీ,బాలింతలు తల్లులు పాల్గొన్నారు..

# పోషన్ మా - ఉప్పు, చక్కెర, నూనె వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి న సీడీ పి ఓ మమత









**జగిత్యాల కరపత్రం ప్రతినిధి అక్టోబర్ 9**
ఐ సి డి ఏస్ ప్రాజెక్టు జగిత్యాల రూరల్ హస్నాబాద్ గ్రామంలో మరియు భీమారం మండలంలోని కాచారం, విలయతాబాద్ గ్రామాలలో పోషణ మా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఉప్పు, చక్కెర, నూనె, ఎక్కువ వాడడం వలన అనేక రకాల రోగాల బారిన పడుతున్నారు.
ఉప్పు మనిషి ప్రతిరోజు ఆహారంలో మూడు నుండి 5 గ్రాములు మాత్రమే తీసుకోవలెను. ఉప్పు ఎక్కువ తీసుకోవడం వలన తొందరగా వృద్ధాప్యం వస్తుంది. తలనొప్పి వస్తుంది హార్ట్ పై ప్రభావం చూపిస్తుంది. నూనె ఎక్కువ వాడడం వలన గుండె చుట్టూ వాల్స్ కూడుకపోవడం అలాగే ఫ్యాట్ పెరగడం లాంటి అనారోగ్యాలకు గురి అవుతారు. చక్కెరను పురుషులు 36 గ్రాములు, స్త్రీలు 25 గ్రాములకు మించి రోజు వాడకంలో తీసుకోకూడదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వాళ్ళు చేసిన కేలరీలో 10% కన్నా తక్కువ చక్కెర తీసుకోవాలి అని తెలుపడం జరిగింది. పండ్లు కూరగాయలు లో సహజంగా లభించే చక్కెర ఆరోగ్యానికి హాని చేసేది కాదు. చక్కెర వాడకానికి బదులుగా బెల్లము, తేనె వాడ వచ్చు. పిల్లలు, తల్లులు, ఆరోగ్యంగా ఉండాలన్న ఉప్పు చక్కెర నూనె వాడకం తగ్గించాలి. అని సిడిపిఓ మమత మేడం గారు వివరించారు. మంచి పోషకాలు గల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సీజనల్ లో వచ్చే పండ్లు అన్ని కూడా తప్పకుండా తినాలి .
ఆకుకూరల పొడి చేసి గాని, వండుకొని గాని తినవచ్చునని తెలియజేశారు.

ప్రతిజ్ఞ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సిడిపిఓ మమత మేడం గారు, సూపర్వైజర్స్ నిర్మల, భాగ్యలక్ష్మి, మరియు పాఠశాల ఉపాధ్యాయులు గౌతమి, రాజేశ్వరి, అంగన్వాడి టీచర్స్ శైలజ,లత,లక్ష్మి, సులోచన, వనజ,ఆశ వర్కర్లు కళావతి, తిరుపతమ్మ,గర్భిణీలు,బాలింతలు,పిల్లలు పాల్గొన్నారు.

# “మహిళలు మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి”

- మహిళల మానసిక ఆరోగ్య సదస్సులో సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ పిలుపు.





**రాజన్న సిరిసిల్ల, కరపత్రం ప్రతినిధి బ్యూరో చీఫ్**
మానసిక ఆరోగ్య దినోత్సవంను పురస్కరించుకొని మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ ప్రభుత్వ సాధారణ వైద్యశాల ఆధ్వర్యంలో ఈరోజు సుందరయ్య నగర్ లోని మహిళలకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ ఏర్పాటు చేసి మాట్లాడినారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాటడుతూ మహిళలు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇటీవలి కాలంలో మహిళలు కుటుంబం, ఉద్యోగం, సామాజిక బాధ్యతలు, మరియు వ్యక్తిగత జీవితం మధ్య సమతౌల్యం సాధించడంలో అత్యధిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగా ఆందోళన, నిరాశ, నిద్రలేమి, కోపం, మరియు శారీరక అనారోగ్యాలు ఏర్పడుతున్నాయని అన్నారు. మహిళలు తమ కుటుంబ అవసరాలనే కాకుండా, తమ వ్యక్తిగత మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా సంరక్షించు కోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఒక సంతోషకరమైన తల్లి, భార్య, ఉద్యోగిని కావాలంటే, ముందు మనసు ప్రశాంతంగా ఉండాలని అన్నారు. మానసిక ఆరోగ్యం కోసం మహిళలు ప్రతిరోజూ స్వీయ సంరక్షణ, మంచి అలవాట్లు అవలంబించాలని తెలిపారు. సరైన నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, యోగా స్నేహితులతో సంభాషణ, అవసరమైతే సైకాలజిస్టు సహాయం పొందడం లాంటివి చేయాలని అన్నారు. ఆరోగ్యకరమైన మనస్సే నిజమైన ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ, మహిళలు పాల్గొన్నారు.

# జమ్మికుంట లో ప్రహ్లాద్ కి నివాళి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 9**
ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలొగ్గకుండా మున్సిపల్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేసి ప్రభుత్వ ఉద్యోగులు గా గుర్తింపు పొందడానికి కృషిచేసి , టీఎన్జీవోస్ యూనియన్ అనుబంధ సంస్థ గా గుర్తింపు చేసిన యూనియన్ వ్యవస్థాపక నేత ప్రహలాద్ మరణించిన సందర్భంగా జమ్మికుంట పురపాలక సంఘ కార్యలయం నందు వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి గటించి నివాళులు అర్పించనైనది. ఇట్టి సభలో జి.రాజిరెడ్డి మునిసిపల్ మేనేజర్ ప్రహలద్ సేవలు ప్రతి మునిసిపల్ ఉద్యోగి మరువకూడదని వారి కృషి వల్లనే మునిసిపల్ ఉద్యోగులకు యూనియన్ అనే ఒక ప్లాట్ ఫామ్ లభించిందని, ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ట్రెజరీ ద్వారా జీతాలు పొందు తున్నారని, తమ హక్కులు సాధించుకోగలుగుతున్నామనివారి ఆత్మకు, శాంతి కలగాలని, ప్రగాఢ సంతాపం తెలిపినారు. ఈ కార్యకమములో వికాస్ ఏఈ, జెయవో రాజ శేఖర్ రెడ్డి, టిపిబివో దీపిక, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, సానిటరి ఇన్స్పెక్టర్ మహేష్, బిసి లు, వార్డ్ ఆఫీసీసర్స్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులతో కలిసి ట్రాక్టర్ డ్రైవ్ చేసుకుంటూ పొలానికి వెళ్లిన మనాలి ఠాకూర్





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 09:** రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు, వారి సతీమణి మనాలి ఠాకూర్ అంతర్గాం మండలంలోని పలు గ్రామాలను సందర్శించి అక్కడి రైతు కూలీలతో భేటీ అయ్యారు. గ్రామాల్లో రైతుల కష్టాలు, వ్యవసాయ పరిస్థితులు, పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులతో కలిసి పొలాల పనుల్లో పాలుపంచుకుంటూ, వారితో ట్రాక్టర్ నడుపుతూ పొలంవైపు ప్రయాణం చేసిన మనాలి ఠాకూర్, రైతుల జీవితానికి దగ్గరగా ఉండే తన మనస్ఫూర్తిని మరోసారి చాటారు. అలాగే గ్రామస్థులతో మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ తీసుకుంటున్న చర్యలను వివరించి, ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటికి త్వరిత పరిష్కారం కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ నూతన కమిటీ ఎన్నిక



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 09:** పెద్దపల్లి జిల్లా గోదావరిఖని లోని ముదిరాజ్ కులస్తుల ఇలవేల్పు శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయం & నాగదేవత ఆలయం నూతన కమిటీని బుధవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు సంవత్సరాల కాలపరిమితితో నూతన అధ్యక్షులుగా (చైర్మన్) గుర్రాల చంద్రశేఖర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా (వైస్ చైర్మన్) రావుల స్వరాజ్ ముదిరాజ్, కోశాధికారి (ట్రెజరర్)గా బండి రాజేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి సంక్షేమం కొరకు ముదిరాజ్ కులస్తులకు విస్తృతంగా ప్రచారం చేసి అమ్మవారి కృపకు పాత్రులు అయ్యే విధంగా కృషి చేయాలని నిర్ణయించారు. అలాగే ఆలయ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గౌరవ అధ్యక్షులుగా మనాలి రాజ్ ఠాకూర్ ని ఎన్నుకున్నారు. సభ్యులుగా సబ్బి మల్లయ్య, అప్పరాజు ప్రభాకర్, ఈర్ల రాజయ్య, నరెడ్ల రాజశేఖర్, జోడు కిష్టయ్య, అనవేన నర్సయ్య, బర్ల మల్లయ్య, బోలవేన సాంబయ్య, బొజ్జ ఉప్పలయ్య, తౌధవేన రాజయ్య, పిట్టల ఇస్తారి, పిట్టల శంకరయ్య, బొల్లి రవికుమార్, శీలం శ్రీనివాస్, ఓదెల రామస్వామి, పిడుగు కృష్ణ ముదిరాజ్ మాజీ కార్పొరేటర్, గైక్వాడి రజనీకాంత్, తూడి రాజయ్య, పిట్టల అంజయ్య, బొల్లి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి గోదావరిఖని అక్టోబర్ 09:** రోడ్ సేఫ్టీ అండ్ అవేర్నెస్ లో భాగంగా ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్ ఆదేశానుసారం గోదావరిఖనిలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సీఐ రాజేశ్వరరావు, ఎస్ఐ హరి శేఖర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. సిగ్నల్స్, హెల్మెట్ ఎందుకు పెట్టుకోవాలి..? సీట్ బెల్ట్ ఎందుకు పెట్టుకోవాలని పిల్లలకు తెలియజేశారు. తప్పనిసరిగా ఇంటి నుండి బయటికి వాహనం తీస్తున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరింపజేయాలని మీ తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు.




## మొదటి విడత నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లు పూర్తి పోలీస్ లు భారీ బందోబస్తు



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 9** మొదటి విడత నామినేషన్ల స్వీకరణకు ప్రక్రియ ఏర్పాట్లు అధికారులు పూర్తి చేయగా , పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మొదటి విడతగా హుజూరాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని హుజూరాబాద్ , జమ్మికుంట, సైదాపూర్, శంకరపట్నం, ఇల్లందకుంట, వీణవంక మండలాల్లో 6 జెడ్పీటీసీ, 70 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.నేటి నుండి నామినేషన్ల స్వీకరణ, ప్రారంభం కానున్న నేపథ్యంలో నామినేషన్ల ప్రక్రియకు పూర్తి ఏర్పాట్లు చేసిన అధికారులు పూర్తి పూర్తి చేయగా , పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.నేటి నుండి ఈ నెల 11వ తేదీ వరకు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# ప్రజాస్వామిక తెలంగాణ లక్ష్యాన్ని సాధించే వైపుగా పునరంకితమవుదాం

**- తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఫ్) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లగౌడ్**



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 09** జమ్మికుంట పట్టణం లో తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఫ్) 15 ఏండ్లు నిండిన సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా టీపీఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లగౌడ్ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రజాస్వామిక తెలంగాణ లక్ష్యాన్ని సాధించే వైపుగా పునరంకితం అవ్వాల్సిన సందర్భం నేటికి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్ళు అవుతుంది. ఈ రాష్ట్ర ఏర్పాటు కోసం తెలంగాణ ప్రజలు 40 ఏళ్లు అవిశ్రాంతంగా పోరాటం నడిపారు. ఈ క్రమంలో ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారు. వ్యక్తులుగా శక్తులుగా సంస్థలుగా తెలంగాణ సమాజం సంవాదం నడిపింది, సంభాషించింది, రగిలి పోయిందన్నారు.మొదటి దశ పోరాటంలో ఉద్యోగులు విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. 360 మంది విద్యార్థులు పోలీసు కాల్పుల్లో మరణించారు. ఆ తర్వాతి కాలంలో ఉద్యోగులు తమ హక్కుల కోసం పోరాడుతూ తెలంగాణ ఆకాంక్షను సజీవంగా ఉంచారన్నారు.90 దశకంలో దేశవ్యాప్తంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటు మరోసారి ఎజెండాపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో తెలుగు నేలపై ప్రధాన విప్లవ పార్టీగా ఉన్న పీపుల్స్ వార్ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను బలపరిచే డాక్యుమెంట్ను విడుదల చేసింది. ఈ డాక్యుమెంటు ప్రజలను ప్రజాస్వామిక వాదులను మేధావులను కవులను కళాకారులను విశేషంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలోనే భువనగిరి డిక్లరేషన్ ,సూర్యాపేట డిక్లరేషన్ ,వరంగల్ డిక్లరేషన్ లు తెలంగాణ సమాజంలో కదలికను తీసుకొచ్చాయి. మేధావులు ఒకవైపు కవులు కళాకారులు మరోవైపు సాహిత్య కృషి చేశారు. తెలంగాణ జనసభ తెలంగాణ ఐక్యవేదిక తెలంగాణ స్టడీ ఫోరం వంటి సంస్థలు ఏర్పడి నిర్మాణాత్మక కృషి చేశాయని అరెల్లి మల్లగౌడ్ తెలిపారు. అయితే 2001లో కొందరు పార్లమెంటరీ రాజకీయ నాయకులు తెలంగాణ ఉద్యమంలోకి ప్రవేశించి తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్యమాన్ని ఉపయోగించుకున్నారు. 2004 లో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్ రెడ్డి తెలంగాణ ఉద్యమం పై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించాడు. పార్లమెంటరీ రాజకీయ నాయకులకు కూడా అనేక పరిమితులు విధించాడు. ఈ కారణాల వల్ల తెలంగాణ ఉద్యమంలో స్తబ్దత ఏర్పడింది. ఇది గమనించిన ఉద్యమకారులు తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకొని క్షేత్రస్థాయి ఉద్యమాలకు పూనుకున్నారు. అమరుడు కామ్రేడ్ గద్దర్ నాయకత్వంలో ఉద్యమకారులందరూ తెలంగాణ వ్యాప్తంగా శాంతి యాత్రలు చేశారు. ఈ కాలంలోనే ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హఠాత్ మరణం, కెసిఆర్ ఆమరణ దీక్ష తెలంగాణ సమాజంలో పెద్ద కదలికను తీసుకొచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను మొదలు పెడుతున్నట్టు ప్రకటించి ఆ వెంటనే వెనక్కు తగ్గింది. ఈ సందర్భంలో మెరుపు వేగంతో విద్యార్థి జేఏసీ ఏర్పడింది తద్ అనుగుణంగానే రాజకీయ జేఏసీ కూడా ఉనికిలోకి వచ్చింది. ఈ పరిణామంతో మళ్లీ తెలంగాణ ఉద్యమంలో దోబూచులాట మొదలైంది.

ఇలాంటి క్లిష్ట సందర్భాలలో తెలంగాణ ఉద్యమకారులు అందరూ ఏకమై 2010 అక్టోబర్ 9న గద్దర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఫ్) పురుడు పోసుకుంది. పార్లమెంటులో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్ తో తెలంగాణ ప్రజా ఫ్రంట్ పని చేస్తూ వస్తుంది. తెలంగాణలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించాలనే లక్ష్యంతో తన కార్యాచరణను రూపొందించుకుంది. అమరులు గద్దర్ ఆకుల భూమయ్య, మద్దిలేటి తదితరుల నాయకత్వంలో పనిచేస్తూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో టీపీఎఫ్ క్రియాశీల పాత్ర పోషించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత కొత్త రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కుల అమలు కోసం కూడా అనేక ఉద్యమాలను నిర్వహిస్తూ వస్తున్నది. దశాబ్దకాలంలో కెసిఆర్ అమలు చేసిన ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాజీ లేకుండా టీపిఎఫ్ సంస్థ పోరాడింది. ఈ క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం 2018 నుంచి నిర్బంధాన్ని అమలు చేసి టీపీఎఫ్ నాయకులను కార్యకర్తలను అరెస్టు చేసి జైలు పాలు కూడా చేసింది. అయినప్పటికీ సంస్థ తిరిగి తన బలాన్ని కూడగట్టుకొని ప్రజల్లో నేటికీ పనిచేస్తూనే ఉంది. మరో పక్కన కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి బ్రాహ్మణీయ ఫాసిస్టు విధానాలను వేగంగా అమలు చేస్తూ పోతుంది. హక్కులు అడుగుతున్న ప్రజల మీద తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించడం చూస్తున్నాము. కార్పొరేట్ రంగం ప్రయోజనాల కోసం మధ్యభారతంలో ఆదివాసీ ప్రజల మీద యుద్ధం ప్రకటించి ఎన్కౌంటర్లు చేస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలను నెరవేర్చేందుకు ప్రజల భూములను ఆక్రమించి నిరాశ్రయులను చేస్తుంది. పర్యావరణాన్ని దెబ్బ తీసే విధానాలను రూపొందిస్తూ ముందుకు వెళుతుంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక హక్కులు అడుగుతున్న రైతులను ఉద్యోగులను నిరుద్యోగులను బెదిరింపులకు గురిచేస్తుంది అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే నేడు తెలంగాణ ప్రజాఫ్రంట్ 15 సంవత్సరాలు పూర్తి చేసుకుని 16వ వడిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు జెండా ఎగురవేత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టింది,

ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అందాల అంజన్న తో పాటు కార్యకర్తలు తదితరులు పాలుగోన్నారు

# 42శాతం బిసి రిజర్వేషన్ లపై హైకోర్టు స్టే సబబు కాదు

**- బహుజన సమాజాన్ని అణిచివేసేందుకు అగ్రవర్ణ ఆదిపత్యాల కులాల కుట్రలు**
**- 10శాతం ఈడబ్లుయస్ రిజర్వేషన్ కోటాతో 60శాతం సుప్రీంకోర్టు సీలింగ్ దాట లేదా**
**- సమాజం లో 60 శాతం బిసి లు ఉండి 42శాతం రిజర్వేషన్ల పై ఎందుకు ఈ కుట్రలు**
**- జక్కె వీరస్వామిగౌడ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు**
**- సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము**



**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 9** తెలంగాణ రాష్టంలో 60 శాతం ఉన్న బిసిలను78 ఏళ్లుగా అన్ని రంగాల్లో అణిచివేతకు గురి చేస్తూ విద్య వైద్య ఉద్యోగం ఉపాధి రంగాలతో పాటు రాజకీయ రంగంలో జనాభా నిష్పత్తి ప్రకారం వనరులు రాకుండా రాజకీయ అధికారం లేకుండా స్వతంత్ర భారత దేశంలో అణిచివేసేందుకు కొనసాగుతున్న కుట్రలో భాగమే అని బీసీ కులాల పోరాటాల ఫలితంగా 42 శాతం తో బిసిలకు రాష్ట ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ తెచ్చిందని సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడసంఘము రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామిగౌడ్ అన్నారు.ఈ రోజు రాష్ట హైకోర్టు ఇచ్చిన తీర్పు చూస్తే బీసీ రిజర్వేషన్ పై జి ఓ ఇచ్చింది రెడ్డి ప్రభుత్వం అడ్డుకుంటుంది రెడ్డి జాగృతి అనేది స్పష్టంగా అర్థం అవుతుందని ఇప్పటికైనా ఈ అగ్రవర్ణ పార్టీలకు చెంచాలుగా మారిన కొందరు బీసీ నాయకులు సోయి తెచ్చుకోవాలని వీరస్వామిగౌడ్ అన్నారు. రాష్ట ప్రభుత్వం జివో 9 ని తెచ్చిన అది నిలబడదుఅని రాజకీయ పునరేకీకరణ ద్వారా మాత్రమే సాధ్యం అని తెలిసిన కాలయాపన చేస్తూ అట్టి రిజర్వేషన్ పై హైకోర్టులో స్టే రావడానికి కారణం పాలక కాంగ్రెస్ తో పాటు ఈ దోపిడీ అగ్రవర్ణ ఆధిపత్య పార్టీ లైన బీజేపీ బిఆర్ఎస్ పార్టీల పాత్ర ఉందని ఇది బహుజన బీసీ సమాజం యొక్క ఆత్మగౌరవం పై సాగుతున్న దాడి అని జక్కే వీరస్వామిగౌడ్ మండి పడ్డారు

బిసి రిజర్వేషన్ 42శాతం రాజ్యాంగం లోని 9 వ షెడ్యూల్ లో చేర్చితేనె రక్షణ ఉంటుందని తెలిసిన ఈ దోపిడీ అగ్రవర్ణ పాలక ప్రతిపక్ష పార్టీలకు చీమ కుట్టినట్లుగా లేకుండా వ్యవహరించాయని ఈ కుట్రల ఫలితమే హైకోర్టు స్టే అని అందుకే రాబోయే రోజుల్లో బీసీ సమాజం ఈ అగ్రవర్ణ పార్టీల కుట్రలు తెలుసుకొని ఆ పార్టీల జెండాలు మోస్తు జై కొట్టటం మానుకోవాలని వీరస్వామిగౌడ్ అన్నారు.


# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి జమ్మికుంట అక్టోబర్ 9** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ , డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ తో కలిసి జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిస్టర్ ను,ఫార్మసీ రూమ్ ను,లేబర్ రూమ్ ను రికార్డులను పరిశీలించడం జరిగింది,తనిఖీ లో భాగంగా ఆరోగ్యశాఖ సిబ్బందికి క్రింది విషయాలపై దిశా నిర్దేశం చేశారు

అందులో

1. ఎన్ సి డి క్లినిక్స్ ను పగడ్బందీగా నిర్వహించాలి అందులో ఎన్ సి డి పరీక్షలు హైపర్ టెన్షన్, డయాబెటిస్, బ్రెస్ట్ క్యాన్సర్ ,ఓరల్ క్యాన్సర్ సర్వైకల్ క్యాన్సర్ వంటి పరీక్షలు నిర్వహించాలి,
2. లెప్రసి సర్వేను ఆశా కార్యకర్తలు ప్రతి గ్రామంలో విధిగా నిర్వహించి ప్రాథమిక దశలో గుర్తించాలి టీబి వ్యాధి నిర్ధారణ కొరకు ఏసీఫ్ క్యాంపు లు పెట్టి,స్పుతుమ్ సాంపిల్స్ సేకరించాలి. అవసరం అనుకున్న వారికి ఎక్స్రే తీయించాలి,
3. ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రతి మంగళవారం శుక్ర వారం తప్పనిసరిగా నిర్వహించాలని అందులో మహిళలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని మహిళలందరూ పాల్గొనేలా చూడాలని,
4. జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శుక్రవారం సభ లో మహిళలందరూ పాల్గొనేలా ప్రోత్సహించాలని,
5. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,
6. సీజనల్ వ్యాధుల మీద తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు డ్రైడే మీద ప్రజలకు అవగాహన కల్పించాలని,సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బీపీ,షుగర్ మందులు ప్రైవేటుగా వాడేవారిని ప్రభుత్వం అందించే మందులనే వాడే విధంగా ప్రోత్సహించాలని తద్వారా వారిని ఆర్థిక భారం నుంచి తప్పించవచ్చు అని ప్రభుత్వ మందులు సమర్ధవంతంగా పనిచేస్తాయని, ఏ బి హెచ్ ఏ కార్డ్స్ ను ఇంప్రూవ్ చేయాలని ప్రజలందరూ ప్రభుత్వ వైద్యాన్ని వినియోగించుకునేలా చూడాలని కోరడం జరిగింది.





ఈ కార్యక్రమంలో డాక్టర్ చందు డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, వైద్యాధికారి డాక్టర్ వరుణ, ఫార్మసిస్ట్ రాజ శ్రీధర్ రావు, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్,ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.